# ప్రజా బంధువు చందర్‌కు ఓటేద్దాం

**• 40వ డివిజన్‌లో బీఆర్ఎస్ ప్రచారం**



ప్రచారం చేస్తున్న కో-ఆప్షన్ సభ్యురాలు తస్నీం భాను

కోల్‌సిటీ, నవంబర్ 15: ఎవరు కష్టాల్లో ఉన్నా సాయం అందించే ప్రజాబంధువు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్‌ను మళ్లీ గెలిపించుకుంటేనే రామగుండం నియోజక వర్గం అభివృద్ధి చెందుతుందని నగర పాలక కో–ఆప్షన్ సభ్యురాలు తస్నీం భాను పిలుపునిచ్చారు. ఈ మేరకు నగర పాలక 40వ డివిజన్ గోదావరిఖని అశోక్‌నగర్, షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో బుధవారం గడప గడపకూ ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి మహిళలను కలిపి సీఎం కేసీఆర్ రూపకల్పన చేసిన మ్యానిఫెస్టో గురించి వివరించారు. ఈ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే మహిళలకు ఇక ఏ కష్టం ఉండబోదన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలంత కారు గుర్తుకు ఓటేసి చందర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

పెద్దపల్లి/ మంథని, నవంబర్ 15: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కేంద్ర ఎన్నికల కమిషన్ బంధనలు తప్పకుండా పాటించాలని పెద్దపల్లి, మంథని రిటర్నింగ్ అధికారులు సీహెచ్ మధుమోహన్, వీ హనుమా నాయక్ సూచించారు. పెద్దపల్లి, మంథని రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో పోటీ చేసే అభ్యర్థులు/ ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పెద్దపల్లిలో ఎన్నికల సాధారణ పరిశీలకులు సీఎన్ శ్రీధర, వ్యయ పరిశీలకులు ఆశిష్ యాదవ్, మంథనిలో వ్యయ పరిశీలకుడు సునీల్ శ్రీవాత్సవ, సహాయ వ్యవ పరిశీలకుడు ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు రూ. 40లక్షలకు మించరాదని, ప్రచార వాహనానికి అనుమతి పత్రం తీసుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ రోజువారీ ఎన్నికల ఖర్చులను సంబంధిత రిజిస్టర్‌లో నామినేషన్ వేసినప్పటి నుంచి ఫలితాలు వెలువడే వరకు జరిపిన ఖర్చును నమోదుచేయాలన్నారు. అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలను ఈనెల 20, 24, 28వ తేదీల్లో మూడు పర్యాయాలు వ్యయ పరిశీలకుల సమక్షంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థి అకౌంట్ నిర్వహణపై అవగాహన కల్పించారు. పెద్దపల్లిలో జరిగిన సమావేశంలో సహాయ ఎన్నికల అధికారి రాజకుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, మంథనిలో జరిగిన సమావేశంలో ఏసీపీ మల్లారెడ్డి, మంథని తహసీల్దార్ రాజయ్య, మీడియా సెల్ నోడల్ అధికారి తూము రవీందర్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ సంతోష్ పాల్గొన్నారు.

**పారదర్శకంగా ఎన్నికల విధులు**

పెద్దపల్లి ఆసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకుడు సీఎన్ శ్రీధర, కేంద్ర వ్యయ పరిశీలకుడు ఆశిష్ యాదవ్ పరిశీలించారు. ఎన్నికల విధులను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా,ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణతో పాటు ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఆర్వో మధుమోహన్‌తో కలిసి పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ఎన్నికలకు సంబంధించిన ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు 81256 84450 నంబర్‌కు కాల్ చేసిగానీ, మేస్సేజ్ ద్వారా ఎన్నికల జనరల్ పరిశీలకులు సీఎన్ శ్రీధరకు ఫిర్యాదు చేయవచ్చునని పెద్దపల్లి ఆర్వో మధు మోహన్ తెలిపారు. సహాయ ఎన్నికల అధికారి రాజకుమార్, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్ విజేందర్ పాల్గొన్నారు.

**వ్యయపట్టికలో నమోదు చేసుకోవాలి**

జ్యోతినగర్, నవంబర్ 15: ఎన్నికల ప్రచారం ఖర్చులను ఎప్పటికప్పుడు వ్యయ పట్టికలో నమోదు చేసుకోవాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్ శ్రీవాత్సవ, సహాయ వ్యయ పరిశీలకులు అశోక్‌కుమార్ అన్నారు. సాయంత్రం ఎన్టీపీసీలోని రామగుండం ఆర్వో కార్యాలయంలో ఆర్వో అధికారి అరుణశ్రీ సమక్షంలో పోటీ అభ్యర్థులతో సమావేశమయ్యారు. అధికారులు వ్యయ వివరాలను వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని, అనుక్షణం సర్వేలెన్స్, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ టీమ్‌లు పర్యవేక్షణలో నియోకవర్గంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

## ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు పురస్కారాలు

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 15: గత అక్టోబర్ నెలలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభకనబరిచిన గోదావరిఖని ఆర్టీసీ డిపో ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రం, నగదు పురస్కారం పంపిణీ జరిగింది. బుధవారం డిపోలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు టీఎస్ ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత ముఖ్యఅతిథిగా హజరై ఉద్యోగులకు నగదు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఇక్కడ గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం, అసిస్టెంట్ మేనేజర్ గీతా కృష్ణ, ఇంజినీర్ సంధ్యారాణి, ఎప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు ఇందిరాదేవి, టీకే స్వామి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థుల ఎంపిక

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 15: పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రం పెద్దపల్లిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి రాష్ట్ర ఎంపిక అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. 1500 మీటర్ల విభాగంలో డీ అజయ్ బంగారు పతకం సాధించగా, 300మీటర్ల విభాగంలో జీ విష్ణువర్ధన్ బంగారు పతకం, డీ అజయ్ సిల్వర్, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జాంప్‌లో గణేశ్ నాయక్ రెండు బంగారు పతకాలు సాధించారు. వీరు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పీఈటీ మంథని వెంకటేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## తబితా ఆశ్రమంలో కలెక్టర్



జ్యోతినగర్(రామగుండం) : ఆశ్రమంలో చిన్నారులతో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

జ్యోతినగర్(రామగుండం), నవంబర్ 15: రామగుండంలోని తబితా ఆశ్రమంలో బుధవారం నిర్వహించిన బాలల దినోత్సవానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హాజరయారు. కేక్‌కట్ చేసి కాసేపు సరదాగా పిల్లలతో మాట్లాడారు. వారి ఆశయాలు, ఆశ్రమంలో వారి దినచర్య తెలుసుకున్నారు. జీవితంలో అనేక కష్టాలు, బాధలు వస్తాయని, వాటిని అధిగమించి ధైర్యంగా లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ఇక్కడ జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, సీడీపీవో స్వరూప రాణి, ఆశ్రమ నిర్వాకుడు వీరేంద్ర నాయక్ ఉన్నారు.

**మద్యంషాపు తనిఖీ**

జ్యోతినగర్, నవంబర్ 15: ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని ఎస్‌వీఎస్ వైన్స్‌ను కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తనిఖీ చేశారు. మద్యం స్టాక్, రోజువారి అమ్మకాల వివరాలు తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. మద్యం స్టాక్, విక్రయలను రిజిస్టార్‌లో పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. బెల్ట్‌షాపులు, రాజకీయ పార్టీలకు బల్క్‌గా మద్యం సరఫరా చేయొద్దని, అక్రమం మద్యం సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం స్టాక్‌ను నిర్దేశించిన గోడౌన్‌లలో మినహాయించి మిగితా చోట డంప్ చేయరాదన్నారు.




మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ జ్యోతి

## పోస్టల్ బ్యాలెట్ 12డీ విధానంపై శిక్షణ

జ్యోతినగర్, నవంబర్ 15: ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్, 12డీ విధానంపై ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హల్‌లో సెక్టర్ ఆఫీసర్స్, పోలింగ్ అధికారులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్, 12డీ విధానం నోడల్ ఆఫీసర్ జ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ సారి 12డీ నూతన విధానం ఆమోదించినట్లు తెలిపారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, కొవిడ్ బాధితులు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. నియోజకవర్గంలో 12డీకి సంబంధించి దివ్యాంగులు, 184మంది, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు 147 మంది ఉన్నట్లు తెలిపారు. 12డీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏర్పాటు చేసిన టీమ్‌లో ఇద్దరు పోలింగ్ అధికారులు(పీఓ, సహాయ పీఓ), సెక్టర్ ఆఫీసర్, బీఎల్వో, పోలీసు అధికారి, మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్, పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు ఉంటారన్నారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్ సురేశ్, ట్రైనింగ్ నోడల్ అధికారి సంపత్‌రావు, మాస్టర్ ట్రైనర్స్, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు ఉన్నారు.

**ఓటరు స్లిప్పులు అందించాలి**

రామగుండం నియోజకవర్గంలో ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పులు అందించాలని అమలు చేయాలని రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె అరుణశ్రీ అన్నారు. ఎన్టీపీసీలోని ఆర్వో కార్యాలయం లో పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్‌ల పంపిణీపై సెక్టార్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి నియోకవర్గ పరిధిలో అన్నిప్రాంతాల్లో ఓటరు స్లిప్పులు అందే లా బీఎల్వోలతో కార్యచరణ చేపట్టి, ప్రణాళిక ప్రకారం నిర్ణీత సమయంలో పంపకాలు జరుగాలన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో నమోదైనఓటరు శాతం కంటే ఈ ఎన్నికల్లో ఓటరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ ఆయా విభాగాల నోడల్ ఆఫీసర్స్ ఉన్నారు.

## సమాజ అభివృద్ధిలో ఓటు కీలకం



అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి స్వరూపరాణి

కోల్‌సిటీ, నవంబర్ 15 : సమాజ అభివృద్ధిలో ఓటు కీలకమని రామగుండం స్వీప్ నోడల్ అధికారి స్వరూప రాణి అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి అరుణ శ్రీ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో గోదావరిఖని పరశురాంనగర్, జవహర్‌నగర్, తిలక్‌నగర్‌లో బుధవారం ఓటు ప్రాముఖ్యత, హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక సారథి కళాకారులు గేయ, ఆట, పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలంతా బాధ్యతా యుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రతి పౌరుడు ఏదొక రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అనుభవిస్తున్నారని, కానీ ప్రతి ఐదళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో మాత్రం ఓటింగ్ శాతం పెరగడం లేదన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలంటే, ఉపాధి అవకాశాలు పొందాలన్నా కనీస అర్హత ఓటు వేయడమే అని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ రజనీ, సీఓలు, జూనియర్ అసిస్టెంట్‌లు, మున్సిపల్ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ట్రాన్స్ జెండర్లు, ఆర్పీలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలు దేవుళ్లతో సమానం

పెద్దపల్లి టౌన్ నవంబర్ 15: సమాజంలో ఎతో మంది తల్లిదండ్రులను కోల్పోయి విధి వంచితులుగా మారుతారని, అనాథ పిల్లలను అందరూ సమానంగా చూడాల, చిన్న పిల్లలు దేవుళ్లతో సమానమని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఆశా జ్యోతి పాజిటివ్ పీపుల్ నెట్‌వర్క్ సొసైటీ సారథ్యంలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ దవాఖానలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని అనాథ పిల్లలకు పోషక ఆహార పర్థాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన ప్రతి ఒక్కరిని చేరదీసి ఆదరిస్తున్న స్వచ్ఛంద సంఘాలు సమాజ హితం కోసం సేవా కార్యక్రామాలు చేయడం అభినందనీయమన్నారు. సమస్యలకు భయపడకుండా ప్రభుత్వం అందిస్తున్న విద్యను అందుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఇక్కడ ఆర్ఎంవో శౌరయ్య, ఐసీటీసీ సిబ్బంది, కౌన్సిలర్ జీ శంకర్, ల్యాబ్ టెక్నీషియన్, ఆర్ శ్రీకాంత్, సొసైటి అధ్యక్షురాలు మమత, లావణ్య, తిరుమల, తదితరులున్నారు.